
రాంజల చెరువులోని నీటి స్థాయిని పరిశీలిస్తున్న ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్


కోసిగి పంచాయతీ కార్యాలయం ఎదుట ప్రధాన రోడ్డులో నిలిచిన వర్షపు నీరు


కౌతాళంలో నీట మునిగిన పంట పొలం చూపుతున్న రైతు


ఆదోని ఎస్కేడీ కాలనీ 5వ రోడ్డులో సీఎస్ఐ చర్చి వద్ద వేర్లతో సహా నేలకొరిగిన భారీ వృక్షం

పొంగిన వాగులు.. నీట మునిగిన పంటలు

- ఆదోని రెవెన్యూ డివిజన్‌లో భారీ వర్షం


కౌతాళంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వంక


ఉప్పరహాల్ వద్ద నిలిచిపోయిన రాకపోకలు

తుపాను ప్రభావంతో ఆదోని రెవెన్యూ డివిజన్‌లో భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లగా..పంట పొలాలు నీటమునిగాయి. పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు వాన పడటంతో ఆదోని మండలంలో అత్యధికంగా 86.8 మి.మీ. మంత్రాలయంలో 66.2, నందవరంలో 50.8, కౌతాళంలో 48.0 పెద్దకడబూరులో 36.8, ఎమ్మిగనూరులో 25.2, హొళగుందలో 23.2, గోనెగండ్లలో 19.2 మి.మీ వర్షపాతం నమోదైంది. కాగా ఈ వర్షానికి ఆదోని రాంజల చెరువు పొంగి ప్రవహించింది. ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ చెరువును పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. కౌతాళం మండలంలో ఉప్పరహాల్, రౌడూరు, అగసలదిన్నె,బాపురం వంకలు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. వంతెనలకు ఇరువైపులా గంటల తరబడి వాహనాలు నిలిచిపోయాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు పొలాల్లో నీరు నిల్వ ఉండి పంటలు కుళ్లిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
–ఆదోని సెంట్రల్/రూరల్/టౌన్/కౌతాళం/కోసిగి

క్లుప్తంగా

ఆ ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: గర్భిణి మృతికి కారణమైన పట్టణంలో ప్రైవేట్ అస్పత్రిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు మహేంద్రబాబు, శేఖర్‌నాయుడు, సురేంద్రబాబు, ఉదయ్, రఘునాథ్, అఫ్రిది డిమాండ్ చేశారు.ఈమేరకు శుక్రవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఆయా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. మంత్రాలయం మండలం సూగూరు గ్రామానికి చెందిన ఓ గర్భిణి ఆసుపత్రికి వెళ్లగా వైద్యుల నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం తగదు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో పారిశుధ్య పనుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని కార్మికులకు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని పార్క్‌రోడ్, కమిటీ రోడ్డు, కర్నూలు బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో పరిశుభ్ర పనులను పరిశీలించారు. పారిశుధ్య కార్మికులు పట్టణంలో క్రమం తప్పకుండా ప్రతి ఇంటికి వెళ్లి చెత్త సేకరించాలని తడి, పొడి చెత్త సేకరణ చేయాలన్నారు. ఇందులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవు

ఎమ్మిగనూరుటౌన్: వార్డు సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని లేనిచో వారిపై చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీలోని వార్డు సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సచివాలయంలో ఉద్యోగుల హాజరు పట్టికతో పాటు పలు రికార్డులు, ఆన్‌లైన్ సర్వీసు వివరాలు, పన్ను వసూళ్ల తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజా సేవల విషయంలో జాప్యం వహించవద్దని సెక్రటరీలను సూచించారు.

15న జిల్లా స్థాయి బాలబాలికల కబడ్డీ పోటీలు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని ఉన్నత పాఠశాల క్రీడమైదానంలో ఈనెల 15వ తేదీన జిల్లా స్థాయి బాలబాలికల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కర్నూలు జిల్లా కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చావిడి వెంకటేష్, కార్యాదర్శి వలకలదిన్నె వెంకటేష్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ జూనియర్ బాల బాలికల కబడ్డీ పోటీలలో పాల్గొనే క్రీడకారులు 01.01.2006 తర్వాత జన్మించిన వారే ఉండాలన్నారు. ఇందులో బాలురు 75 కేజీలు, బాలికలు 65 కేజీల బరువు కలిగి ఉండాలన్నారు. పాల్గొనే వారు తప్పకుండా బర్త్ సర్టిఫికెట్, 10వ తరగతి మార్క్స్ జిరాక్స్ కాపీ ఆధార్ కార్డుకొని కోసిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్దకు రావాలని సూచించారు. వివరాలకు ఫోన్ నెంబర్ 9177320094ను సంప్రదించగలరని కోరారు.

పాత బ్రిడ్జిపై ట్రాఫిక్ జామ్

ఆదోని అర్బన్: పట్టణంలోని పాత ఓవర్ బ్రిడ్జి, ఓవర్ బ్రిడ్జి కింద, అర్థగేరి బస్టాండు వద్ద శుక్రవారం ట్రాఫిక్ జాం అయ్యింది. మార్కెట్‌యార్డు సీజన్ ప్రారంభం కావడంతో రైతులు పత్తి దిగుబడులు తెస్తున్నారు. ఒకవైపు బళ్లారి వెళ్లే వాహనాలు, మరోవైపు మాధవరం వెళ్లే వాహనాలు ఈ ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గోనెగండ్ల: మండలంలోని హంద్రీనది పరివాహక గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండా లని తహసీల్దార్ రాజేశ్వరి కోరారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గాజులదిన్నె ప్రా జెక్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు కురువడంతో ప్రా జెక్టులోకి భారీగా వరద నీరు వస్తుంది. దీంతో నది పరివాహక ప్రాంతాలు గాజులదిన్నె, హెచ్. కై రవా డి, పుట్టపాశం, వేముగోడు, తిప్పనూరు తదితర గ్రామాలకు చెందిన ప్రజలు అటువైపు వెళ్లరాదన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందివ్వాలని తెలిపారు.

ఆదోని సెంట్రల్: రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పురపాలక కమిషనర్ కృష్ణ శుక్రవారం సూచించారు. ఏవైనా సమస్యలు తలెత్తితే కె.సి.రవి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జ్: 9676654911, బి.జి. నాగరాజు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జ్ 9849387640, ఎ. పులికొండ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జ్ 8328462073 నంబర్లకు సంప్రదించాలని వెల్లడించారు.

వారిని కఠినంగా శిక్షించాలి

కౌతాళం: అలూరు మండలం మణేకుర్తి గ్రామంలో కురవ కులస్తుల ఆరాధ్య దైవం కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కౌతాళం మండల కురవ సంఘం అధ్యక్షుడు వీరేష్ డిమాండు చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కనకదాస విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం దారుణమన్నారు.

వీధి కుక్కల నుంచి కాపాడండి

పెద్దకడబూరు : వీధి కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని డీవైఎఫ్‌ఐ మండల కార్యదర్శి రాజు, ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి విల్సన్ డిమాండ్ చేశారు. ఆ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట శుక్ర వారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఎక్క డ చూసినా వీధి కుక్కల బెడద ఎక్కువ అయ్యిందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆదోని అర్బన్: ఆదోని పట్టణం, చుట్టుపక్క గ్రామాల్లో శనివారం ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని డీఈ పురుషోత్తం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 132/32కేవీ, 33/11కేవీ సబ్‌స్టేషన్లు, విద్యుత్‌లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ, మరమ్మతుల కారణంగా ఈ కోతలు విధిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కోసిగి: కోసిగి మండలంలో నేడు విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ వీరేష్ తెలిపారు. ఉదయం 9.3గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు.

రేషన్ బియ్యం సరఫరా చేయాలని ధర్నా

ఆదోని రూరల్: పెద్దతుంబళం గ్రామంలోని 1, 2 వార్డుల్లోనే కార్డుదారులకు రేషన్ బియ్యం సరఫరా చేయాలని సీపీఎం మండల కార్యదర్శి లింగన్న డిమాండ్ చేశారు. శుక్రవారం కార్డుదారులతో కలిసి సచివాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ మధ్యనే 1, 2 వార్డుల్లో కాకుండా డీలర్ తన సొంత ఇల్లు ఉన్న దొడ్డిగేరి ప్రాంతంలో రేషన్ వేస్తున్నాడని, అంత దూరం వెళ్లి తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా మారిందన్నారు. అనంతరం వెల్ఫేర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాజా, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

కౌలుకార్డులు ఇవ్వాలని వినతి

కౌతాళం: కౌలుదారులకు కౌలు కార్డులు ఇచ్చి బ్యాంకు రుణాలు ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు తహసీల్దారు రజనీ కాంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలో కౌలు రైతులు చాల మంది ఉన్నారని రెవెన్యూ అధికారులు కొద్ది మందికే కౌలు కార్డులు ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, కౌలు రైతు సంఘం మండల నాయకులు శంకర్, బడేసా, మాబాషా వీరేష్, రైతు సంఘం మండల కార్యదర్శి ఈరన్న, పలువురు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి

ఎమ్మిగనూరుటౌన్/ నందవరం: తమ సమస్యలు పరిష్కరించాలని గ్రామ సచివాలయ ఉద్యోగులు శుక్రవా రం ఎంపీడీఓలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఏ ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు లేని విధంగా తమపై పని భారం పెంచారన్నారు. వలంటీర్ విధులు తమ తో చేయిస్తున్నారని, దీని నుంచి తమను తప్పించాల ని కోరారు. పనివేళలు పాటించకుండా వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించడం, సెలవులు, పండుగలు, ఆది వారం రోజుల్లో కూడా బలవంతపు విధులు చేయించ డం మానుకోవాలన్నారు.అలాగే తమకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. వీటిపై సర్కారు స్పందించకపోతే ఏపీ గ్రామ సచివాలయ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.


నందవరంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కృష్ణమూర్తికి వినతి పత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

నందవరం : మత్తు పదార్థాలకు బానిస కాకుండా, విద్యపై దృష్టి పెట్టాలని శక్తి టీమ్ సభ్యులు ఏఎస్ఐ నటరాజ్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఈవ్‌టీజింగ్ ర్యాగింగ్, సైబర్ నేరాలు, మహిళలు, బాలికలు రక్షణ, బాల్య వివాహాలు, శక్తి టీమ్ విధులు, నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకొని రాణించాలన్నారు. నేటి సమాజంలో మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు ఎక్కువయ్యాయని, ధైర్యంగా ఎదుర్కొవాలన్నారు. అలాగే శక్తి టీమ్ మహిళలు, బాలికలకు రక్షణ కల్పిస్తుందని, బాలికలు శక్తి టీమ్ సేవలను వినియోగించుకోవాలన్నారు. చిన్న పిల్లలకు బాల్య వివాహాలు చేయడం చట్ట రీత్యా నేరమని, బాల్య వివాహాలు చేస్తే శిక్షర్హులవుతారని వివరించారు. కార్యక్రమంలో శక్తి టీమ్ సభ్యులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శక్తి టీమ్ సభ్యులు ఏఎస్ఐ నటరాజ్

సంక్షిప్తం

సమస్యల పరిష్కారంలో విఫలం

పెద్దకడబూరు: ఉద్యోగుల, ఉపాధ్యాయుల దీర్ఘకాలి క సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఏపీటీఎఫ్ నాయకులు వీరేష్, రమేష్ అన్నారు. ఆ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆర్ఐ జెర్మియాను కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. . పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు కా నీ,వేతన సవరణలు కానీ, కరువు భత్యం మంజూ రు చేయడం కానీ జరగడం లేదన్నారు. పెండింగ్ లో ఉన్న 4డీఏలు నేటికి విడుదల చేయలేదన్నారు.

15 నుంచి విద్యారంగ సమస్యలపై పోరాటం

ఎమ్మిగనూరుటౌన్: ఈనెల 15వ తేదీ నుంచి 19 వరకు విద్యారంగ, ఆర్థిక సమస్యలపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో పోరాట ప్రచార యాత్ర నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా నాయకుడు వై.రామాంజినేయులు పేర్కొన్నారు. శుక్రవారం ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను కడివెళ్ల హైస్కూల్‌లో హెచ్‌ఎం ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో కలిసి ఆయన ఆవిష్కరించారు.

వైభవంగా దశమి ఉత్సవాలు ప్రారంభం

గోనెగండ్ల: గోనెగండ్లలో చింతలాముని, నల్లారెడ్డి స్వాముల దశమి మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలకు రాష్ట్రం నుంచే కాక తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరానున్నారు. ఉత్సవాలు శుక్రవారం తెల్లవారు జామున 2 గంటలకు గుర్రపు పల్లకీ సేవతో ప్రారంభమయ్యాయి. నేడు దశమి మహోత్సవం జరుగుతుంది.

పంచాయతీ కార్మికుల పట్ల సర్కారు నిర్లక్ష్యం

మంత్రాలయం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, వారి సమస్యలు పరిష్కరిండం లేదని సీఐటీయూ నాయకులు జయరాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం ఈఓపీఆర్డీ ఉపేంద్రరెడ్డికి గ్రామ పంచాయతీ కార్మికులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పారిశుధ్య కార్మికులకు కనీసం రూ.26 వేలు జీతం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు ప్రకాశం, ప్రసంగి, రాజు, యేజుకేల్ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో చదవండి

రిటైర్డ్ జిల్లా జడ్జి విరుపాక్ష దత్తాత్రేయగౌడ్

ఆదోని అర్బన్: ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని పట్టుదలతో చదవాలని రిటైర్డ్ జిల్లా జడ్జి విరుపాక్ష దత్తాత్రేయగౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ కో ఆపరేటివ్ బ్యాంకు హాల్‌లో బ్యాంకు చైర్మన్ రాచోటి రామయ్య ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన 53 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ జిల్లా జడ్జి హాజరై మాట్లాడారు. విద్యార్థులు స్వశక్తితో, సన్మార్గంలో నడవాలన్నారు. నిరాశ చెందకుండా ఆశయం వైపు అడుగులు వేయాలన్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులను ఆ దిశగా ప్రోత్సహించాలని చెప్పారు. విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకు బ్యాంకు తరఫున రాచోటి రామయ్య గోల్డ్‌మెడల్స్ అందించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో బ్యాంకు బీఓఎం రాచోటి సుబ్బయ్య, డైరెక్టర్ లక్ష్మీనారాయణశెట్టి, మేనేజర్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రముఖులు, వ్యాపారులు పాల్గొన్నారు.


విద్యార్థులకు మెడల్, సర్టిఫికెట్లు అందజేస్తున్న రిటైర్డ్ జిల్లా జడ్జి విరుపాక్ష దత్తాత్రేయగౌడ్


కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

అసంక్రమిత వ్యాధులపై అవగాహన అవసరం

ఎమ్మిగనూరుటౌన్: అసంక్రమిత వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ మహేశ్వర ప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో స్థానిక అర్బన్ అసుపత్రుల్లో పనిచేసే ఆరోగ్య కార్యకర్తలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే సామాజిక అధికారులకు అసంక్రమిత వ్యాధులు,ఎన్‌సీడీ 4 క్యాన్సర్ వ్యాధి తదితర వాటిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ మారిన జీవన శైలితో వచ్చేఅధిక రక్తపోటు, మధుమేహం,గుండె సంబంధిత వ్యాధులు, పక్షవాతం,నోటి, గర్భాశయ, రొమ్ము క్యాన్సర్లను ముందస్తుగా గుర్తించి చికిత్స అందించాలన్నారు. ఇందులో భాగంగా డాక్టర్ మంజుష నోటి క్యాన్సర్, గర్భాశయ ముఖద్వారా, రొమ్ము క్యాన్సర్, స్క్రీనింగ్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి చికిత్స అందించాలన్నారు. స్త్రీవ్యాధి నిపుణురాలు సుజిత మూడు రకాల క్యాన్సర్లు, వైద్య పరీక్షలు, చికిత్స తదితర అంశాల గురించి తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజల్లో చిన్నపాటి లక్షణాలు కనిపించినా వెంటనే స్క్రీనింగ్ చేసి కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఆసుపత్రికి మంగళవారం , గురువారం ఓపీ 222కు రెఫర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు ఆదినాగేష్,డాక్టర్ సౌజన్యలత, డెంటల్ డాక్టర్ సంధ్యకుమారి పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ మహేశ్వర ప్రసాద్

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


మంత్రాలయంలో స్కూల్‌గేమ్స్‌కు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మంత్రాలయం రూరల్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్‌కు ఎంపికై నట్లు హెచ్‌ఎం విఠోబరావు తెలిపారు. జిల్లాస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ఎంపికైన విద్యార్థినీ, విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఈ సందర్భంగా అభినందించారు. ఆయన మాట్లాడుతూ. అండర్ 14 గేమ్స్ పోటీల్లో భాగంగా సెపక్‌తక్రా పోటీలో పురుషుల విభాగంలో రమేష్, విజయ్, అదేవిధంగా అండర్ -14 విభాగంలో బాలికలు తనుశ్రీ, అంజలి ఉత్తమ ప్రతిభ చాటారు. అలాగే అండర్-17 విభాగంలో బాలుర రామానాయుడు, బాలికల విభాగంలో పద్మశ్రీ, అఖిల, అండర్-19 విభాగంలో రాధమ్మ, రుబిక ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ నేపథ్యంలో వారు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం పేర్కొన్నారు.

మతోన్మాద కార్పొరేట్ శక్తులను ఓడిద్దాం

పెద్దకడబూరు: వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకిక శక్తుల ఐక్యతతో మతోన్మాద కార్పొరేట్ శక్తులను ఓడిద్దామని సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆర్థిక సామాజిక స్థితిలో మార్పులు రావాలంటే ప్రజాస్వామ్య వ్యవస్థలను రాజ్యాంగ స్ఫూర్తిని, లౌకిక భావాలను కాపాడుకోవాలని గట్టిగా నినదించిన వ్యక్తి సీతా రాం ఏచూరి అని గుర్తుచేశారు. కార్మిక వర్గం, రైతాంగం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. లేబర్ కోడ్స్ తీసుకొని రావడం, రైతులకు కనీస మద్దతు ధరల ను కల్పించకపోవడం, ప్రజలపై విపరీతమైన భారా లు వేయడం అందులో భాగమేనన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి శ్రీనివాసులు, కేవీపీఎస్ మండల అధ్యక్షుడు దేవదాసు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయ సాధనకై ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాధాకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సురేష్, రాముడు, లక్ష్మీనర్సయ్య, రమేష్,కృష్ణ,రాజు తదితరులు పాల్గొన్నారు.

దళితుల హక్కులకోసం పోరాడుదాం

ఆదోని రూరల్: దళితుల హక్కుల సాధనకై కలిసికట్టుగా పోరాడుదామని కేవీపీఎస్ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఎస్.గోపాల్, మండల అధ్యక్ష, కార్యదర్శులు మునిస్వామి, తిక్కప్ప, కాటికాపరుల సంఘం పట్టణ కార్యదర్శి యువరాజు అన్నారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో 79 సంవత్సరాల స్వాతంత్ర్యం-దళితులు అనే అంశంపై ఈనెల 15న ఆదోని పట్టణంలోని ఎన్‌జీవోస్ హోంలో కేవీపీఎస్ నిర్వహించే సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అయినా నేటికీ రాజ్యాంగంలోని ఆర్టికల్ 13 నుంచి 17 దాకా చెప్పబడిన అంశాలు ఆదోని పశ్చిమ ప్రాంతానికి వర్తించవు అన్నట్లుగా పరిస్థితి కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి తిప్పన్న, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ,ఉపాధ్యాయులకు 30శాతం ఐఆర్ ఇవ్వాలి

ఎమ్మిగనూరుటౌన్: గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ,ఉపాధ్యాయులకు 30శాతం మధ్యంతర భృతి మంజూరు చేసి పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాటూర్ రవికుమార్ డిమాండ్ చేశారు.శుక్రవారం సాయంత్రం ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ఉపాధ్యాయులు సమస్యలపై నిరసన తెలిపి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని రీ సర్వే డీటీ జ్యోతిర్మయికి వినతి పత్రాన్ని ఇచ్చారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు విషయంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం నాడు ఎన్నికల ముందు ఉద్యోగ,ఉపాధ్యాయులకు ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపుతామని ప్రకటించి నేడు దాని ఊసే ఎత్తడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినా ఒక్క డీఏ కూడా విడుదల చేయలేదన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు సర్కారు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రాఘవరెడ్డి, శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శులు కాశింజీ,వీరేష్, రంగనాథ్,రాష్ట్ర కౌన్సిలర్ యువై పరుశురామ్,జిల్లా సీనియర్‌నాయకులు హేమంత్‌కుమార్, అంపయ్య,రామన్న, రామ్మోహన్,వీరశేఖర్,బసవరాజు,బుట్టాశ్రీనివాసులు,తిప్పయ్య,సురేంద్ర,జట్టప్ప,మహబుబ్‌బాష,భీమేష్, రాజశేఖర్,వెంకటేష్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

పెద్దకడబూరు : వరకట్న వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. మండల పరిధిలోని మేకడోణ గ్రామంలో శుక్రవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి వివరాల మేరకు.. ఎమ్మిగనూరు మండలం టీఎస్ కూలూరు గ్రామానికి చెందిన మాసుంసా కూతురు హసీన(35)ను మేకడోణ గ్రామానికి చెందిన కాసింసా కొడుకు రహంతుల్లాకు ఇచ్చి 2006లో పెళ్లి చేశారు. వారికి ఇద్దరు ఆడ పిల్లలు, ఒక కొడుకు ఉన్నాడు. పెళ్లి అయిన కొన్ని రోజుల వరకు సంసారం సాఫీగా సాగింది. తర్వాత నుంచి అదనపు కట్నం కోసం భర్త, బావ, అత్త, మామలు వేధించడం మొదలు పెట్టారు. ఈ బాధను భరించలేక కొంత కాలం పుట్టినింటికి వెళ్లిపోయింది. తరువాత భర్త, కుటుంబ సభ్యులు ఆమె ఊరికి వెళ్లి బాగా చూసుకుంటామని చెప్పి ఇంటికి పిలుపించుకున్నారు. వచ్చిన తర్వాత మళ్లీ యథాప్రకారమే వేధించడంతో జీవితంపై విరక్తి చెందిన హసీన పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆదోని ఆసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ ఆమె ప్రాణాలు వదిలారు. తమ కుమార్తె మృతికి భర్తతో పాటు అత్తమామలే కారణమని హసీన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.